31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

బుధవారం 10 జూన్ 2026 పేజీలు : 8

## కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



**చురకలు విలేఖరి, మల్యాల, జూన్, 09 :** మంగళవారం పురస్కరించుకుని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామున కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే క్షేత్రపాలకుడైన శ్రీ బేతలస్వామి వారిని కూడా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయానికి సుమారు 20 వేల మంది భక్తులు విచ్చేసినట్లు అధికారులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆలయ ఈఓ ఎస్ అంజనారెడ్డి భక్తులకు ఇలాంటి అసౌకర్యం కలగకుండా పర్యవేక్షించారు. ఏఈఓ హరిహర్నాథ్, సూపరింటెండెంట్లు చంద్రశేఖర్, సునీల్, టెంపుల్ ఇన్స్పెక్టర్లు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## పిఎంజె జ్యూవెల్లరీ షాప్ దోపిడీ కేసు

**-ముగ్గురు నిందితుల పోలీస్ కస్టడీ ముగింపు,**
**-ఆయుధాలు-మొబైల్ రికవరీ.**
**-బీహార్‌లో మరో కీలక నిందితుడు (ఏ -10) అరెస్ట్**
**-వివరాలు వెల్లడించిన కరీంనగర్ పోలీసు కమీషనర్ గౌష్ ఆలం**







**చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, జూన్ 9 :** న్యాయస్థానం ఆదేశాల మేరకు పి ఎం జె జువెలరీ షాప్ దారిదోపిడీ కేసు దర్యాప్తులో భాగంగా ముగ్గురు ప్రధాన నిందితులను పోలీసులు నాలుగు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచా రించారు. 03-06-2026 ఉదయం 11:00 గంటల నుండి 07-06-2026 ఉదయం 10:30 గంటల వరకు ఈ పోలీస్ కస్టడీ కొనసాగింది. పోలీస్ కస్టడీలో విచారించిన నిందితుల వివరాలు: ఏ -1: సుబోధ్ సింగ్ (తండ్రి: ఈశ్వరి ప్రసాద్ సింగ్, నివాసం: చిష్టిపూర్ గ్రామం, చాందీ పి ఎ ఎస్ నలందా జిల్లా, బీహార్) ఏ -2: రఘునాథ్ కర్మాకర్ అలియాస్ జగీరా సింగ్ (వయస్సు: 41 సం॥, నివాసం: ఆసన్సోల్ సౌత్ పి ఎ ఎస్ పశ్చిమ బర్ధమాన్ జిల్లా, పశ్చిమ బెంగాల్)ఏ -3: రవీష్ కుమార్ అలియాస్ ప్రద్యుమన్ (వయస్సు: 23 సం॥, నివాసం: హిల్సా మండల్, నలందా జిల్లా, బీహార్) పోలీస్ కస్టడీ సమయంలో పంచుల (సాక్షుల) సమక్షంలో నిందితులను సుదీర్ఘంగా విచారించగా, కీలకమైన ఆయుధాలు మరియు మొబైల్ ఫోన్ రికవరీ అయ్యాయి. ఆయుధాల స్వాధీనం: నిందితులు ఏ-2 మరియు ఏ-3లు ఇచ్చిన సమాచారం మేరకు, వారిని వెంటబెట్టుకుని వెళ్ళగా... వెలిచాల బైపాస్ రోడ్ వద్ద గల చెట్ల పొదలలో దాచి ఉంచిన, నేరానికి ఉపయోగించిన రెండు పిస్టల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొబైల్ ఫోన్ స్వాధీనం: నిందితులు తప్పించుకుపోయిన మార్గమైన ధర్మపురి వైపు విచారణ జరపగా, మద్దునూరు గ్రామ పరిధిలోని బగ్గారం మండల అటవీ ప్రాంతం సమీపంలో నేరానికి సంబంధించిన ఒక వి వో కంపెనీ (వెండి --గులాబీ రంగు) మొబైల్ ఫోన్‌ను గుర్తించి, పంచుల సమక్షంలో స్వాధీనం చేసుకోవడం జరిగింది. విచారణలో -2లో

### రాజీతో కేసులను

## పరిష్కరించుకోండి

### ఎస్పీ అశోక్‌కుమార్



**జగిత్యాల ప్రతినిధి,జూన్ 09 :** జూన్ 20, 2026న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భం గా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, లోక్ అదాలత్‌లో క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ నిర్వహణకు సంబంధించిన కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు తదితర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం కల్పించబడు తుందని తెలిపారు. "రాజీ మార్గమే రాజ మార్గం" అనే భావనతో న్యాయ వ్యవస్థ కల్పించిన ఈ అవకాశాన్న సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది మరియు ఇతర అధికారులు రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసులను పరస్పర రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.

### ప్రగతి ప్రణాళిక పనులు

## విజయవంతగా పూర్తి చేయాలి

**అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలి**



**జగిత్యాల ప్రతినిధి, జూన్, 09 :** ప్రజాపాలన -- ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా మెట్ పెల్లి మున్సిపల్ పరిధిలో నిర్వహించిన వార్డు సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో మెట్ పెల్లి మున్సిపల్ చైర్మన్ లింబాద్రి , మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లతో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే వార్డు పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు మరియు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఆ అక్రమార్కులెవ్వరు?

**హుజురాబాద్ లో పట్టపగలు భూకబ్జాకు యత్నం!**
**అత్యంత విలువైన ప్రభుత్వ జూనియర్ కళాశాల భూమి ఆక్రమణకు అక్రమార్కుల కుట్ర!**



**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)** హుజురాబాద్ పట్టణంలో విలువైన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోంది. ఇప్పటికే చెరువుల కుంటల కాలువల శిఖం భూములను పలువురు కబ్జా చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా కొందరు వ్యక్తులు పట్టణ నడిబొడ్డున ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేశారు. విలువైన కళాశాలకు చెందిన భూమిని చదును చేశారు. అయితే కబ్జాదారులు ఎవరు? వారి వెనుక ఉన్న బడాబాబులు ఎవరు అన్నది హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన స్థలం చాలాచోట్ల ఆక్రమణలకు గురైంది. ప్రభుత్వ భూములను ప్రభుత్వ యంత్రాంగమే కాపాడుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. కళాశాల మైదానం చుట్టూ కొంతమేర మాత్రమే కాంపౌండ్ వాల్ నిర్మించి ఉంది. గ్యాస్ గోదాం -2లో

## డిటిఓను కలిసిన టూరిస్టు బస్సుల అసోసియేషన్



**జగిత్యాల జూన్ 09 :** జగిత్యాల డిటిఓగా సందాని మహమ్మద్ ఇటీవలే పదవీ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా జగిత్యాల పాత బస్టాండ్ టూరిస్ట్ బస్సుల అసోసియేషన్ కమిటీ మంగళవారం జగిత్యాల డిటిఓ సందాని మహమ్మద్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డిటిఓ ను సన్మానించి, అభినందనలు తెలిపారు. డిటిఓ ను కలిసిన వారిలో జగిత్యాల పాత బస్టాండ్ టూరిస్ట్ బస్సుల అసోసియేషన్ అధ్యక్షులు మహమ్మద్ ఇక్బాల్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కాలగిరి రఘుపతి రెడ్డి,సభ్యులు దుంపల ప్రభాకర్ రెడ్డి, చుక్క నవీన్, కిషన్,రమేష్, రాజేందర్,అద్దె బస్సు యజమానుల సంఘం జగిత్యాల డిపో అధ్యక్షులు మంత్రి వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి చుక్క వేణుగోపాల్,జర్నలిస్ట్ కాసం శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## ముస్లిం న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడిగా మహమ్మద్ అంకూస్ నియామకం



**చురకలు ప్రతినిధి,ములుగు, జూన్ 09 :** ములుగు జిల్లా ముస్లిం న్యాయ వేదిక అధ్యక్షుడిగా ములుగు మండలం కాసిందేవిపేట గ్రామానికి చెందిన ప్రముఖ సీనియర్ నాయకులు మహమ్మద్ అంకూస్ నియమితులయ్యారు. ముస్లింల ప్రజాభిప్రాయం ప్రకారం, సంఘం రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యాసిన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ రఫతుల్లా సిఫారసుల మేరకు ఈ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి.?రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం, సమాజంలో మంచి పలుకుబడి ఉన్న మహమ్మద్ అంకూస్.. ఇంతకాలం వివిధ రాజకీయ పార్టీల బలోపేతానికి తన అమూల్యమైన సమయాన్ని కేటాయించారు. ప్రస్తుత తరుణంలో ముస్లింల ఐక్యత, జనాభా దామాషా ప్రకారం వారి హక్కుల సాధన కోసం పోరాడాలని ఆయన నిర్ణయించుకున్నారు. మైనారిటీలపై జరుగుతున్న వివక్షను రూపమాపి, సామాజిక న్యాయం కోసం సంఘ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తానని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ యాసిన్ మాట్లాడుతూ.. ముస్లిం జాతిని బలోపేతం చేయాలనే సంకల్పంతో ఉన్న అంకూస్ ను జిల్లా అధ్యక్షుడిగా నియమించడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.హక్కుల సాధనే నా ధ్యేయం అని మహమ్మద్ అంకూస్ అన్నారు.తన నియామకంపై ములుగు జిల్లా నూతన అధ్యక్షుడు మహమ్మద్ అంకూస్ హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో ముస్లింలందరినీ ఏకం చేసి, వారి హక్కుల రక్షణకు, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఆయన ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

## గాలివానకు నేలమట్టమైన బోటింగ్ బుకింగ్ ఆఫీస్ షెడ్



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జూన్ 09 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటి లింగాల గోదావరి తీరంలోని పర్యాటక శాఖకు చెందిన బోటింగ్ టికెట్ బుకింగ్ ఆఫీస్ షెడ్ సోమవారం రాత్రి గాలివానకు పూర్తిగా లేచిపోయి నేలమట్టమైంది.షెడ్డు రేకులు,బీరువా ,కుర్చీలు,బల్లలు,రికార్డులు,తదితర సామాగ్రి మొత్తం గాలికి కొట్టుకుపోయి,వర్షానికి తడిసిపోయాయి.బోటు పైకప్పు ఎగిరిపోయింది. కొన్ని వస్తువులు గాలికికొట్టుకుపోయి నది నీటిలో పడిపోయాయి. విపరీతమైన గాలికి వెల్గటూర్ నుండి కోటేశ్వర స్వామి ఆలయం,గోదావరికి వెళ్లే రహదారిలో చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగి పడడంతో రాకపోకలు నిలిచియాత్రికులు ఇబ్బంది పడ్డారు.బోటింగ్ టికెట్ బుకింగ్ ఆఫీస్ షెడ్డు గాలికి కొట్టుకు పోవడంతో ఎంత నష్టం జరిగిందో తెలియాల్సి ఉంది.తాత్కాలిక షెడ్డు కాకుండా రికార్డులు, విలువైన వస్తుసామాగ్రి,ఉద్యోగుల వసతి,కోసం శాశ్వత భవనం నిర్మించడం తోపాటు, కొత్త బోట్లు ఏర్పాట్లు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# మాజీ మంత్రి హరీష్ రావు పర్యటన విజయవంతం చేయండి

### -బిఆర్ఎస్ సీనియర్ నేత పొనగంటి శ్రవణ్



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 9 :** హుజురాబాద్ నియోజక వర్గంలో ఈనెల 12న జరిగే మాజీ మంత్రి, శాసనసభ పక్ష ఉప నేత, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పర్యటనను విజయవంతం చేయాలని బి ఆర్ ఎస్ సీనియర్ నేత పొనగంటి శ్రవణ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆధ్వర్యంలో జమ్మికుంటలోని ఎంపి ఆర్ గార్డెన్లో ఉదయం 10గంటలకు జరిగే కార్యకర్తల సమావేశంలో హరీష్ రావు పాల్గొంటారని,కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. హరీష్ రావు పర్యటనను కార్యకర్తలు పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని కోరారు. హుజురాబాద్ ఉపఎన్నికల సమయంలో అప్పటి మంత్రి హరీష్ రావు చొరవ తోనే అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని గుర్తు చేశారు.నాడు హుజురాబాద్ జమ్మికుంట పట్టణాల్లో సీసీ రోడ్లు వేశారని, గ్రామాల్లోనూ సిసి రోడ్లతో పాటు అన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. ఆరడుగుల బుల్లెట్ హరీష్‌రావు హుజురాబాద్ పర్యటనకు రావడం హర్షణీయమని,కార్యకర్తలు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికేందుకు తరలిరావాలని కోరారు.ఇందుకోసం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.ఉప ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినప్పటికీ.. మళ్లీ 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజురాబాద్ ప్రజలు బి ఆర్ ఎస్ కు పట్టం కట్టారని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన వ్యతిరేకత ప్రజల్లో రైతుల్లో యువతలో ఉందని, కాంగ్రెస్ పార్టీ అన్ని రంగాల్లోనూ విఫలమైందని శ్రవణ్ విమర్శించారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ప్రభంజనాన్ని సృష్టిస్తుందని, మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని పొనగంటి శ్రవణ్ జోస్యం చెప్పారు.

# పిఎంజె జ్యూవెల్లరీ షాప్ దోపిడీ కేసు

**మొదటి పేజీ తరువాయి....** కొంత సమాచారం సేకరించినప్పటికీ, నిందితులు పూర్తిస్థా యిలో పోలీసులకు సహకరించలేదు. దొంగిలించిన సొత్తు (బంగారు,వజ్రాల ఆభరణాలు) ఎక్కడ దాచారు? ఎవరికి విక్రయించారు? ఎవరెవరికి ఆర్థిక లావా దేవీలు జరిగాయి? అనే కీలక సమాచా రాన్ని నిందితులు ఉద్దేశపూర్వ కంగా దాచిపెడుతున్నారు. ఆభరణాల దాచి వేత, రవాణా విషయాలపై నిందితులు పరస్పర విరుద్ధమైన, తప్పుదారి పట్టించే వాంగ్మూలాలు ఇచ్చారు.ముఖ్యంగా, గతంలో గుండాల అటవీ ప్రాంతంలో సొత్తు దాచినట్లు చెప్పిన ఏ -2 (రఘునాథ్ కర్మాకర్), ఇప్పుడు ఆ సమాచారం నుండి వెనక్కి తగ్గాడు. కేసును ఉద్దేశపూర్వకంగా తప్పుదారి పట్టించడానికే నిందితులు ఇలా చేస్తున్నట్లు దర్యాప్తులో తేలింది. ఈ నేపథ్యంలో, నిందితులను మరికొన్ని రోజులు పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ గౌరవ న్యాయస్థానంలో ప్రత్యేకంగా రిక్విజిషన్ దాఖలు చేయనున్నారు.

పరారీలో ఉన్న మరో కీలక నిందితుడి (ఎ -10) అరెస్ట్

ఈ కేసులో పరారీలో ఉన్న మిగతా నిందితులను పట్టుకోవడానికి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా పోలీస్ బృందం ఒక భారీ విజయాన్ని సాధించింది.

అరెస్ట్ వివరాలు: తేది: 04-06-2026 న బీహార్ రాష్ట్రం, పాట్నా జిల్లాలోని సలింపూర్‌లో ఏ -10 నిందితుడైన అమర్‌సింగ్ అలియాస్ పహిల్వాన్ అలియాస్ అమరేంద్ర కుమార్ సింగ్ (తండ్రి: దివంగత రమేశ్వర్ సింగ్, వయస్సు: 43 సం., నివాసం: రూపాస్ మహాజీ, సలింపూర్ ( పి ఎ ఎస్ ) ను పోలీసులు విజయవంతంగా అరెస్ట్ చేశారు. నిందితుడిని అక్కడ స్థానిక న్యాయస్థానం ముందు హాజరుపరిచి, కరీంనగర్‌కు తీసుకువచ్చి ఇక్కడి న్యాయస్థానంలో ప్రవేశపెట్టడానికి పోలీసులు ట్రాన్సిట్ వారెంట్ పొందారు. ప్రస్తుతం ప్రత్యేక పోలీస్ బృందం నిందితునితో కలిసి కరీంనగర్‌కు ప్రయాణంలో ఉన్నది. ఈ కేసులోని మిగిలిన పరారీ నిందితుల కోసం గాలింపు చర్యలు వేగవంతంగా కొనసాగుతున్నాయని సీపీ గౌష్ ఆలం తెలిపారు.

## ఆ అక్రమార్కులెవ్వరు?

**మొదటి పేజీ తరువాయి...**వైపు కాంపౌండ్ వాల్ లేదు. దీనిని కబ్జాదారులు అవకాశంగా తీసుకుంటున్నారు. గతంలోనూ ఇలాగే ఆక్రమణలకు ప్రయత్నించారు. కళాశాల మైదానం ప్రాంతంలో గజానికి 30 వేల నుండి 40 వేల వరకు ధర పలుకుతోంది. కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయరావు స్వయంగా భూ అక్రమనకు సంబంధించి మంగళవారం ప్రకటన చేశారు. అసలు రికార్డుల ప్రకారం జూనియర్ కళాశాలకు ఎంత భూమి ఉండాలి? ప్రస్తుతం ఎంత ఉంది? ఎంత కబ్జాకు గురైంది అన్నది సర్వే చేసి దీనిపై అధికార యంత్రాంగం ప్రకటన చేయాల్సి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం కదిలి వచ్చి.. విలువైన కళాశాల స్థలం ఆక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే పూర్తిస్థాయిలో ప్రహరీ గోడ నిర్మాణం చేయాలని స్థానికులు, కళాశాల ప్రిన్సిపల్, సిబ్బంది కోరుతున్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న సీనియర్ జర్నలిస్ట్



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9.** పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండల సీనియర్ జర్నలిస్టు బసంత్ నగర్ లో జరిగిన పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. బసంత్ నగర్ కు చెందిన మొహమ్మద్ తాజోద్దీన్ కుమారుడు మొహమ్మద్ ఇజాజ్ వివాహ రిసెప్షన్ వేడుకలు బసంత్ నగర్ లోని జిఎం గార్డెన్ లో మంగళవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో సీనియర్ జర్నలిస్టు తో పాటు ఎంఏ జమీల్, అజార్, వాజిద్, తాపాజుల్ నవాజ్, షాబాజ్ ఖాన్, మతిన్ ఖాన్, అజ్మల్, సోహెల్, సాజన్, ఐ మాన్ తదితరులు పాల్గొన్నారు.

## సనాతన ధర్మ పునరుజ్జీవన శిల్పి శివానంద మూర్తి



**జూన్ 10... శివానంద మూర్తి వర్ధంతి**

సద్గురు శివానందమూర్తి అనే నామం వినగానే సనాతన ధర్మ పరిరక్షణ, భారతీయ సంస్కృతీ వైభవం, అచంచలమైన దేశభక్తి, గురుత్వ మహిమల సమ్మేళన రూపం మన కళ్లముందు సాక్షాత్కరిస్తుంది. ఆధునిక కాలంలో సమాజం భౌతిక విలువల వైపు పరుగులు తీస్తూ, నైతిక విలువల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో, ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని రగిలించి వారిని సన్మార్గంలో నడిపించిన యుగపురుషుడు ఆయన. ఆయన జీవిత ప్రస్థానం కేవలం ఒక సాధారణ ఆధ్యాత్మిక గురువుకు సంబంధించినది కాదు; అది యావత్ భారతదేశ మూలాలను శోధించి, సంస్కృతిని పునరుజ్జీవింపజేసిన ఒక మహోన్నత సాంస్కృతిక యాత్ర. బాహ్య పూజలు, మూఢనమ్మకాలకు అతీతంగా ఆధ్యాత్మికతను సామాజిక బాధ్యతతోనూ, జాతీయ చైతన్యంతోనూ ముడిపెట్టిన అరుదైన తాత్విక దార్శనికుడు సద్గురు. సంపన్న జమీందారీ కుటుంబంలో జన్మించినప్పటికీ, లౌకిక సుఖాలను తృణప్రాయంగా భావించి సనాతన ధర్మ రక్షణే శ్వాసగా బతికిన ఆయన జీవితం భావితరాలకు నిరంతర ప్రేరణాత్మకం. శివానందమూర్తి గారు 1928 డిసెంబర్ 21వ తేదీన నాటి మద్రాసు ప్రెసిడెన్సీ పరిధిలోని చారిత్రక నగరమైన రాజమహేంద్రవరంలో జన్మించారు. జమీందారీ వంశం వారిది. తండ్రి వీరబసవరాజు, తల్లి సర్వమంగళాదేవి .

# గడీ బురుజు స్థలాల్లో రిజిస్ట్రేషన్లు నిలిపివేయాలి

**-అఖిలపక్ష, ప్రజా సంఘాల డిమాండ్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూన్ 09 :** కోరుట్ల పట్టణంలోని చారిత్రాత్మక గడీ బురుజు ఆస్తి, ఖాళీ స్థలాలకు సంబంధించి ఎలాంటి రిజిస్ట్రేషన్లు చేపట్టవద్దని అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు కోరుట్ల సబ్-రిజిస్ట్రార్ డి. అశోక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు డాక్టర్ పేట భాస్కర్,ఎం.డి.ముజాహిద్ మాట్లాడుతూ గడీ బురుజు ఆస్తి చారిత్రాత్మక ప్రాధాన్యం కలిగిన ప్రజా ఆస్తి అని పేర్కొన్నారు. ఈ భూమిని కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు తప్పుడు ఆధారాలతో ప్రైవేటు వ్యక్తుల పేర్లపై నమోదు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని తెలిపారు. గతంలో కూడా ఈ అంశంపై అఖిలపక్ష ప్రజా సంఘాలు ధర్నాలు నిరసనలు రాస్తారోకోలు నిర్వహించాయని సుమారు 30 మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన వినతిపత్రాలను అధికారులకు సమర్పించిన విషయాన్ని గుర్తు చేశారు. గడీ బురుజు స్థలాల పరిరక్షణ కోరుట్ల ప్రజల సామూహిక ఆకాంక్షగా ఉందన్నారు. ఇటీవల ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ జరిగినట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగాయని పేర్కొన్నారు. ఒకవేళ రిజిస్ట్రేషన్ జరిగి ఉంటే అది ఏ ఆధారాలపై జరిగిందో సమర్పించిన పత్రాలు నిజమైనవో కాదో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ వివరాలు, యాజమాన్య పత్రాలు, లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, డాక్యుమెంట్ నంబర్లు, సర్వే నంబర్లు, హద్దులు, ఎన్‌కంబ్రెన్స్ మరియు ఇండెక్స్ రికార్డులు సహా అన్ని వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. గడీ బురుజు ఆస్తి వ్యవహారంలో పూర్తి పారదర్శకత పాటించాలని, అక్రమాలు జరిగి ఉంటే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ఆస్తుల పరిరక్షణ విషయంలో అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష, ప్రజా సంఘాల నాయకులు చింత భూమేశ్వర్, శనిగారపు రాజేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# కౌలు రైతు ఆత్మహత్య

**-కౌలు చేసిన పొలం దగ్గరనే ఆత్మహత్య**
**-పంట దిగుబడి తగ్గిందని, పెట్టుబడి అప్పులు తీర్చేది ఎలా...? అని బెంగ**

**జగిత్యాల ప్రతినిధి, జూన్, 09 :** జగిత్యాల జిల్లా బుగ్గారం మండల కేంద్రంలోని మానాల పెద్ద దుబ్బయ్య (60) అనే కౌలు రైతు (దళిత రైతు) ఆత్మ హత్య చేసుకొని బలవన్మరణం చెందారు. కుటుంబీకులు, బుగ్గారం ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాల ప్రకారం మానాల పెద్దదుబ్బయ్య (60) అనే దళితరైతు వ్యవసాయం చేసుకుంటూ తన కుటుంబాన్ని పోషించుకుంటూ జీవిస్తుంటారు. బుగ్గారం గ్రామానికి చెందిన పలువురు రైతుల భూములను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తుంటారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర రాక, పంట దిగుబడి కూడా తగ్గి పోయి అప్పుల పాలయ్యాడు. అప్పటికే అప్పుల బాధలతో సతమతం అవుతున్న ఆయన ఈ ఏడాది వరి పంట దిగుబడి చాలా తక్కువగా వచ్చిందని,పంట పెట్టుబడి బాకీలు,భూ యజమానులకు కౌలు డబ్బులు కూడా ముట్టే పరిస్థితి లేదని బెంగ పెట్టుకున్నారు. గత నాలుగైదు రోజులుగా తీవ్ర మనస్థాపం చెంది, నీరసంగా ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం జగిత్యాలకు పోయి వస్తానని ఇంట్లో వాళ్లకు చెప్పి ఇంటి నుండి బయలు దేరాడు. రాత్రి వరకు కూడా ఆయన ఇంటికి తిరిగి రాలేదు. సోమవారం రాత్రి అతని ఆచూకీ కోసం కుటుంబీకులు ఎంత వెతికినా ఫలితం లభించలేదు. మంగళవారం ఉదయం బుగ్గారం శివారు,చందయ్యపల్లి రోడ్డులో అతను కౌలుకు చేసిన పంట పొలాల సమీపం లోనే విగత జీవిగా శవమై కనిపించాడు .వెంటనే బుగ్గారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై



జి.సతీష్ ఆ స్థలానికి చేరుకొని శవాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ సభ్యులను, బంధువులను, గ్రామస్తులను విచారించారు. మృతుడి కుమారుడు మానాల లక్ష్మి నారాయణ పిర్యాదు మేరకు వ్యవసాయం ద్వారా వచ్చిన నష్టాలతో అప్పులు పేరుకు పోయాయని ,మనస్థాపం చెంది మాకు ఎవరికీ చెప్పకుండా మా నాన్న (మానాల పెద్ద దుబ్బయ్య) కౌలు చేసిన పొలాల వద్దకు వచ్చి గుర్తు తెలియని విష పదార్థాలను సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు పిర్యాదు చేశారని ఎస్సై తెలిపారు. వెంటనే పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. జగిత్యాల ఏరియా ఆసుపత్రికి పోస్టు మార్టం నిమిత్తం శవాన్ని తరలించారు. పోస్టు మార్టం



అనంతరం లాంఛనాల ప్రకారం బుగ్గారంలో మానాల పెద్ద దుబ్బయ్య కు “అంతిమ యాత్ర” నిర్వహించి అంత్యక్రియలు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై జి.సతీష్ తెలిపారు. మృతి చెందిన రైతు మానాల పెద్ద దుబ్బయ్య కు భార్య, ఒక కుమారుడు, ముగ్గురు కూతుళ్ళు, మనుమలు, మనుమరాండ్లు ఉన్నారు.

# ఆస్తి కోసం అంత్యక్రియలు అడ్డగింత



**జగిత్యాల ప్రతినిధి, జూన్,09 :** ఆస్తికోసం కన్న తండ్రికి అంత్యక్రియలు నిర్వహించకుండా కూతుళ్లు అడ్డుకున్న ఘటన జగిత్యాల పట్టణంలోని హనుమాన్ వాడలో చోటుచేసుకుంది., జంగిలి మల్లయ్యకు కుమారుడు మల్లేశంతోపాటు ఇద్దరు కూతుళ్లు సంతానం. మల్లేశం కరోనా సమయంలోనే చనిపోయాడు. అప్పటికే మల్లేశంకు భార్య సుజాత, కుమారుడు మనోజ్, కూతురు ఉన్నారు. అయినప్పటికీ మల్లయ్య ఆస్తిని కూతుళ్లిద్దరూ వారి పేరున రాయించుకున్నారు. ఈ నేపథ్యంలో మల్లయ్య (80) అనారోగ్యంతో నిన్న మృతిచెందాడు. విషయం తెలుసుకున్న సుజాత, మనోజ్ అంత్యక్రియలు నిర్వహించేందుకు వెళ్లారు. అప్పటికే ఇంటికి చేరిన మల్లయ్య కూతుళ్లు, అల్లుళ్లు సుజాత, మనోజ్ పై దాడికి పాల్పడ్డారు. మనోజ్ తో అంత్యక్రియలు చేయిస్తే తాము రాయించుకున్న ఆస్తిని ఎక్కడ తిరిగి ఇవ్వాల్సి వస్తుందోనని గొడవకు దిగారు. ఎట్టిపరిస్థితుల్లోనూ అంత్యక్రియలు మనోజ్ తో జరిపించబోమని తేల్చిచెప్పారు.



# మున్సిపల్ చైర్‌పర్సన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన కమిషనర్



**చురకలు ప్రతినిధి కోరుట్ల,జూన్ 09 :** కోరుట్ల మున్సిపల్ కార్యాలయానికి పూర్తి స్థాయి బాధ్యతలను స్వీకరించిన మున్సిపల్ కమిషనర్ వి.రాఘవేందర్ మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌కు మొక్కను అందజేసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మాట్లాడుతూ  కోరుట్ల పట్టణ అభివృద్ధి కోసం పరస్పర సహకారం సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా 24 గంటలూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని కమిషనర్‌ను కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పట్టణాభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. కమిషనర్ వి.రాఘవేందర్ మాట్లాడుతూ  పట్టణంలోని అన్ని వార్డులను సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటానని చెప్పారు. వార్డు కౌన్సిలర్లు, ప్రజలతో కలిసి ప్రతి ప్రాంతంలోని సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలోనూ కోరుట్ల మున్సిపాలిటీ ఆదర్శ మున్సిపాలిటీగా నిలిచేలా తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు తిరుమల గంగాధర్, డీఈఈ. అరుణ్, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దుబాయ్ రోడ్డు ప్రమాదంలో ముగ్గురు జిల్లా వాసులు మృతి



**జగిత్యాల ప్రతినిధి, జూన్, 09 :** దుబాయిలో అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మరణించారు. వీరిలో ముగ్గురు తెలంగాణ ప్రవాసీయులు ఉండగా అందులో జగిత్యాల జిల్లా వాసులు ఉన్నారు. దుబాయిలో అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రహదారిపై సోమవారం జరిగిన ప్రమాదంలో ఏడుగురు మరణించారు. వీరిలో ముగ్గురు తెలంగాణ ప్రవాసీయులు ఉన్నారు. క్షతగాత్రుల్లో నలుగురికి సాధారణ వార్డులో చికిత్స అందిస్తుండగా వీరిలో హైదరాబాద్‌కు చెందిన మొహమ్మద్ సయిాద్ కూడా ఉన్నారు. ఇక విషమ పరిస్థితుల్లో ఉన్న ఐదుగురిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు ఎంత మంది ఉన్నారనే సమాచారం ఇంకా తెలియలేదు. మృతులు ముగ్గురూ కూడా జగిత్యాల జిల్లాకు చెందిన వారేనని ప్రాథమిక సమాచారం. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం నమిలికొండ గ్రామానికి చెందిన సయ్యద్ సలీం (51), మల్యాల మండలం తక్కళ్ళపల్లి గ్రామానికి చెందిన గొల్లపలి తిరుపతి గౌడ్ (42), మెట్ పల్లి మండల కేంద్రంలోని గాజులపేటకు చెందిన అబ్దుల్ రఫీఖ్ (37)లు ఈ ప్రమాదంలో మరణించారు. మృతదేహాలను భారత్‌కు పంపించడానికి దుబాయిలోని భారతీయ కాన్సులేటు అధికారులు మృతుల కుటుంబాలతో సంప్రదింపులు జరుపుతున్నారు. బాధితులను



దుబాయిలోని సామాజిక కార్యకర్త గుండెల్లి నరసింహ కూడా పరామర్శించారు. షార్జా కేంద్రంగా ఉన్న ఒక అల్యూమినియం డోర్ ఫ్రేం, గ్లాసుల పరిశ్రమలో వీరందరు పని చేస్తున్నారని తెలిసింది. అకస్మాత్తుగా సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లారీని వెనక నుంచి వచ్చి మినీ బస్సు ఢీకొనడంతో ఈ దుర్ఘటన జరిగింది.

# సమీకృత కూరగాయల మార్కెట్ పనులు పూర్తి చేయాలి

**-మున్సిపల్ కార్యాలయం ఎదుట బీజేపీ ధర్నా**
**-అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా సమీకృత మార్కెట్**
**-బిజెపి పట్టణ అధ్యక్షుడు దొనికెల నవీన్**
**-సమీకృత మార్కెట్ అందుబాటులోకి రాకుంటే తీవ్ర స్థాయిలో ఆందోళనలు**
**-బిజెపి ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప-వేణుగోపాల్**



**చురకలు ప్రతినిధి,మెట్‌పల్లి, జూన్ 09 :** మెట్‌పల్లి పట్టణంలో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో... వాటిని తక్షణమే పునఃప్రారంభించి మార్కెట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటు లోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షుడు ధోనికెల నవీన్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమం లో పార్టీ నాయకులు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధోనికెల నవీన్ మాట్లాడుతూ రైతులు,కూరగాయల వ్యాపారులు,వినియోగదారుల సౌక ర్యార్థం కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన సమీకృత కూరగాయల మార్కెట్ ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకపోవడం దురదృష్ట కరమన్నారు.నిర్మాణ పనులు,మౌలిక వసతుల కల్పన మధ్యలోనే నిలిచి పోవడంతో మార్కెట్ ఉపయోగానికి రాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పట్టణంలోని ప్రధాన రహదారుల వెంటనే కూరగాయల విక్రయాలు కొనసాగుతున్నాయని, దీనివల్ల రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు తీవ్రమవుతున్నాయని తెలిపారు. రహదారులపై వ్యాపార కార్యకలాపాలు నిర్వహించబడటంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,అనేక చోట్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రజలు గాయపడటమే కాకుండా ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు కూడా ఏర్పడు తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతి నిధులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రజా ధనంతో నిర్మించిన మార్కెట్‌ను నిరుపయోగంగా వదిలే యడం సరైంది కాదన్నారు.మార్కెట్ ప్రాంగణం ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, దీనిపై అధికారులు వెంటనే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.అనంతరం బిజెపి ఫ్లోర్ లీడర్ ధర్మపురి స్వరూప- వేణు గోపాల్ మాట్లాడుతూ పట్టణ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మార్కెట్‌లో మిగిలి ఉన్న అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, రైతులు, వ్యాపారులు ఒకే చోట తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.సమీకృత మార్కెట్ అందుబాటు లోకి వస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు రైతులు, వ్యాపారులకు మెరుగైన సౌకర్యాలు కలుగుతాయని పేర్కొన్నారు. సమీకృత కూరగాయల మార్కెట్ పనుల ను తక్షణమే ప్రారంభించి పునరుద్ధరిం చాలని కోరారు.త్వరలోనే చర్యలు తీసుకోకపోతే మరింత తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ధర్నా అనంతరం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్ర మంలో బీజేపీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ధర్మపురి సరూప్ వేణుగోపాల్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బొడ్ల ఆనంద్, కౌన్సిలర్ కొయ్యల్కర్ స్రవంతి లింగేశ్వర్, బొడ్ల వసుధ నాగేష్, కలికోట శ్రీకాంత్, బత్తుల జగదీష్, పాస్కంటి శ్రీనివాస్, మిట్టపల్లి కృష్ణమూర్తి, కొయ్యల లక్ష్మణ్, సుంకె అశోక్, నూనె క్రాంతి, మరి నరసయ్య, బొడ్ల అనిల్, గుండవేని శేఖర్, సత్యనారాయణ, హనుమాండ్లు, భాస్కర్, భోగ దత్తు, జగన్, గుండు మోహన్, కాదాసు శ్రీనివాస్, ప్రభాకర్, దండిక నరసయ్య, రఘుపతి, సదానందం తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థలు ప్రారంభం కాబోతున్నా... విద్యా హక్కు చట్టం అమలు చేయరా?

**-ప్రభుత్వ నిర్లక్ష్యంపై బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివాజీ గౌడ్ ఆగ్రహం**



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 09 :** రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా విద్యా హక్కు చట్టం (=ఌజు ాఘ్-2009) ను కఠినంగా అమలు చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్నం.శివాజీ గౌడ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "విద్య ప్రతి చిన్నారి హక్కు... కానీ నేడు అది కొందరి వ్యాపార వస్తువుగా మారిపోయింది" అని మండిపడ్డారు. రాష్ట్రంలో అనేక ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ వేల రూపాయల ఫీజులు, డొనేషన్లు వసూలు చేస్తూ పేద మరియు మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు.విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కల్పించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, చాలా విద్యాసంస్థలు ఆ నిబంధనను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని విమర్శించారు. అధికారులు చూసీ, చూడనట్టు వ్యవహరించడం వల్లే ప్రైవేట్ విద్యాసంస్థల దందా రోజురోజుకు పెరుగుతోందన్నారు."ఐఐటీ - జేఈఈ -ఒలింపియాడ్ -ఇంటర్నేషనల్ స్కూల్" పేర్లతో ప్రజలను ఆకర్షిస్తూ అనుమతులు,మౌలిక వసతులు లేకుండానే పాఠశాలలు కొనసాగుతు న్నాయని ఆరోపించారు. కావున జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.అలాగే పుస్తకాలు, యూనిఫామ్‌లు, బస్సు ఫీజుల పేరుతో జరుగుతున్న దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.పేద విద్యార్థులకు ఉచిత మరియు నాణ్యమైన విద్య అందించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యను వ్యాపారంగా మార్చే వారిపై ప్రభుత్వం వెంటనే ఉక్కుపాదం మోపాలని పొన్నం.శివాజీ గౌడ్ డిమాండ్ చేశారు.

# సీనియర్ సిటిజెన్లు సమాజ మార్గదర్శకులు

**-జిల్లా రెవిన్యూ అధికారి కే. వై. ప్రసాద్**



**జగిత్యాల, ప్రతినిధి జూన్ 9 :** సీనియర్ సిటిజెన్లు, పెన్షనర్లు సమాజ మార్గదర్శకులని జిల్లా రెవిన్యూ అధికారి కే. వై. ప్రసాద్ అన్నారు.జిల్లా రెవిన్యూ అధికారిగా నూతనంగా పదవీ భాధ్యత లు స్వీకరించిన కే.వై.ప్రసాద్‌ను అయన ఛాంబర్లో మంగళవారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్ సంఘాల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్లు కలిసి పుష్పగుచ్చం అందించి సన్మానించి స్వాగతించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ గతంలో రెవిన్యూ ఉద్యోగుల అధ్యక్షులుగా సేవలు అందించి రిటైర్ అయిన హరి అశోక్ కుమార్ ప్రస్తుతం సీనియర్ సిటిజెన్ల, పెన్షనర్లకు విశిష్ట సేవలు అందించడంను కొనియాడారు. హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ వివిధ మండలాల్లో సేవలు అందించి ప్రజా తహసీల్దార్ గా పేరొందిన కే. వై. ప్రసాద్ జిల్లా రెవిన్యూ అధికారిగా పదోన్నతి పై రావడం పట్ల తమ సంఘాల పక్షాన స్వాగతించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరి శెట్టి విశ్వనాథము, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. సి. హన్మంత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు ఎం. డి. యాకూబ్, వెల్ముల ప్రకాష్ రావు,బాలయ్య, సత్యనారాయణ, బత్తుల శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్

**-కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్**



**చురకలు ప్రతినిధి,మల్లాపూర్, జూన్ 9 :** ఆడబిడ్డలకు అండగా కల్యాణలక్ష్మి , షాదీ ముబారక్ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో కోరుట్ల ఎమ్మెల్యే మండలానికి చెందిన 89 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థికభారం తగ్గించాలనే లక్ష్యంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని, భవిష్యత్తులో బీఆర్ఎస్ పార్టీ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాం చందర్, ఎంపిడివో శ్రీకాంత్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యదర్శికి ఘనంగా వీడ్కోలు



**జగిత్యాల, టౌన్, జూన్ 09 :** జగిత్యాల జిల్లా జగిత్యాల రూరల్ మండలంలోని కన్నాపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శిగా గత 5 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తించిన ఎలిగేటి ప్రతిభ బదిలీపై వెళ్తున్న సందర్భంగా గ్రామ సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ ఆధ్వర్యంలో ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి ఆమె అందించిన సేవలను గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు కొనియాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డ్ సభ్యులు, నూతన గ్రామ కార్యదర్శి, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు,మహిళలు,యువకులు మరియు గ్రామ ప్రజలు పాల్గొని ఎలిగేటి ప్రతిభకు శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం సర్పంచ్ పొట్టవత్తిని సతీష్ మాట్లాడుతూ,గ్రామ అభివృద్ధిలో ఆమె చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొంటూ,భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

## 108 అంబులెన్స్ ఆకస్మిక తనిఖీ



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (ముత్తారం)జూన్ 09 :** పెద్దపల్లి జిల్లా 108 కో- ఆర్డినేటర్ జంపాల కుమారస్వామి ముత్తారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో 108 అంబులెన్సు ఆకస్మికంగా తనిఖీ చేశారు.గత కొది రోజులుగా ముత్తారం మండలంలో అందిస్తున్న వైద్య సేవలు,అంబులెన్స్ లోని వైద్య పరికరాలు,ఔషధాల లభ్యత,సిబ్బంది పనితీరు,పలు రికార్డులను పరిశీలించారు.సేవల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అత్యవసర కేసులు వచ్చిన వెంటనే స్పందించాలని,సమయస్ఫూర్తితో సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.రోడ్డు ప్రమాదాలు,గర్భిణీల ప్రసవ సమయ అత్యవసర పరిస్థితులు,వేసవి కాలంలో పెరుగుతున్న వడదెబ్బ కేసుల నేపథ్యంలో ప్రజలు 108 అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ కొంక సాగర్,పైలట్ వెంకటేష్ పాల్గొన్నారు.

# పోక్సో కేసులో సంచలన తీర్పు

**-నిందితుడుకి 20 సంవత్సరాల జైలు శిక్ష, రు.5000/- జరిమానా..**

**-పోలీసు-ప్రాసిక్యూషన్ సమన్వయంతో నిందితులకు వరుస శిక్షలు**

**-నిందుతుడికి శిక్ష పడటంలో కృషి చేసిన అధికారులను , పిపి,సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 09 :** గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన (పోక్సో) కేసులో నిందుతుడీకి 20 సంవత్సరాలు జైలు ,5000/- రూపాయల జరిమానా విధిస్తూ సిరిసిల్ల పోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధికా జైస్వాల్ మంగళవారం రోజున తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు.



**కేసు వివరాలు..**

గంభీరావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను గోరింటాల గ్రామానీకి చెందిన కోటగిరి శ్రీనివాస్ అనే వ్యక్తి వేధింపులకి గురి చేయగా బాధితురాలి తండ్రి ఫిర్యాదు మెరకు గంభీరావుపేట పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసి అప్పటి సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి దర్యాప్తు అనంతరం నిందితుడిని రిమాండ్ కి తరలించారు.అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయడం జరిగింది.

**కోర్టు తీర్పు..**

కోర్టు విచారణలో భాగంగా అదనపు ఎస్పీ చంద్రయ్య పర్యవేక్షణలో కోర్టు మానిటరింగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్,ఎఎం కానిస్టేబుళ్ నవీన్,పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల కోర్టులో 15 మంది సాక్షులను ప్రవేశపెట్టగా ప్రాసిక్యూషన్ తరుపున గత పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్ గారు వాదించగా,శాస్త్రీయ ఆధారాలు, సాక్షులను పరిశీలించిన న్యాయమూర్తి నేరము రుజువు కావడంతో నిందితుడైన కోటగిరి శ్రీనివాస్ కి 20 సంవత్సరాలు జైలు శిక్ష , 5000/-జరిమాన విధించారు.సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ శిక్ష నుండి తప్పించుకోలేరని,శిక్షల ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని జిల్లా ఎస్పీ తెలిపారు.పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ సమన్వయంతో వ్యూహాత్మకంగా న్యాయ విచారణ,న్యాయ నిరూపణ నిర్వహించి నిందితులకు తప్పనిసరిగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.ఈకేసులో పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి నిందితునికి శిక్ష పడటంలో కృషి చేసిన అదనపు ఎస్పీ చంద్రయ్య, అప్పటి డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, ప్రస్తుత డిఎస్పీ నాగేంద్రచారి,పబ్లిక్ ప్రాసిక్యూటర్ పెంట శ్రీనివాస్,గంబిరావుపేట ఎస్.ఐ శ్రీకాంత్,కోర్టు మానిటరిశీగ్ ఎస్.ఐ రవీందర్ నాయుడు,కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్,cms కానిస్టేబుల్ నవీన్,పొక్సో కోర్టు కానిస్టేబుల్ వెన్నెల లను జిల్లా ఎస్పీ అభినందిచారు.

# ఉపాధి హామీలో నాటిన ఈత మొక్కలు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 09 :** గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్ గ్రామంలో లింగం చెరువు కట్ట పైన ఉపాధిహామీ పథకంలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌లో భాగంగా స్థానిక సర్పంచ్ గంగసాయవ్వ రాజారాం మంగళవారం ఈత మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కమ్మరి గంగ సాయవ్వ రాజారాంతో పాటు ఉపసర్పంచ్ కురెల్లి రామచంద్రారెడ్డి డైరెక్టర్ మోతే దేవిరెడ్డి,వార్డు సభ్యులు ఎర్ర సంతోష్ గౌడ్ సంఘం ప్రెసిడెంట్ ఎర్ర రామయ్యగౌడ్ ఎల్లాగౌడ్ కిషన్ గౌడ్ డైరెక్టర్ నారాగౌడ్ ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ సిబ్బందికి పదవి విరమణ

**-రాజన్న సిరిసిల్ల జిల్లా సంక్షేమ అధికారి, పి. లక్ష్మీరాజం వెల్లడి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 09 :** జిల్లాలో అంగన్వాడీ కేంద్రాల్లో పని చేస్తున్న వారిలో 65 సంవత్సరాలు నిండిన వారికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు గౌరవ జిల్లా కలెక్టర్ అనుమతితో పదవి విరమణ కల్పిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి పి.లక్ష్మీరాజం,ఒక ప్రకటనలో తెలియజేశారు. వేములవాడ ప్రాజెక్టు నుండి ఇద్దరు సిరిసిల్ల ప్రాజెక్టు నుండి 13 మంది మొత్తం పదిహేను మందికి ఈ అవకాశం కల్పించినట్లు వివరించారు. వారిలో ఎనిమిది మంది టీచర్లు ఏడుగురు అంగన్వాడి హెల్పర్లు ఉన్నట్లు వివరించారు. వారికి రావలసిన పదవీ విరమణ ప్రయోజనాల మొత్తం కోసం ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు వివరించారు.అలాగే ఇట్టి విషయంలో ఎవరికైనా ఏదైనా అభ్యంతరాలు ఉన్నట్లయితే తగు ఆధారాలతో జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో వయసు నిర్ధారణ పత్రాలతో పదవ తారీఖు సాయంత్రం ఐదు గంటల లోపు కలవాలని ఆయన సూచించారు.

# బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

**-సిరిసిల్ల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమ**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట జూన్ 09 :** బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు ప్రతి ఒక్కరూ శక్తివంచనలేకుండా కృషి చేయాలని సిరిసిల్ల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తూల ఉమ అన్నారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఎల్లారెడ్డి పేట వీర్నపల్లి మండలాల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది.ఈ సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం సభ్యత్వ నమోదు ఇంచార్జ్ తుల ఉమ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు.మాజీ జడ్పిటిసి సభ్యులు చీటి లక్ష్మన్‌రావు కార్యాలయం లో ఉమకు తేనేటి విందు ఇచ్చి మాజీ జెడ్పిటిసి చీటి లక్ష్మణ్‌రావు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీమండల అధ్యక్షులు వరుస కృష్ణ హరి, సింగిల్ విండో అద్యక్షులు గుండారపు కిష్టారెడ్డి,నాయకులు కుంబాల మల్లారెడ్డి, పిల్లి రేణుక కిషన్, గుల్లపెల్లి నర్సింహా రెడ్డి, ఎల్లారెడ్డి పేట్ సర్పంచ్ ఎలాగందుల నర్సిహింలు, మీసం రాజం మండల ఉపసర్పంచ్ పోరం అధ్యక్షులు మందాటి రాముయాదవ్,ఉప సర్పంచ్‌గా బంధారపు బాలెడ్డి కొర్రి అనిల్ కుమార్,గన్నమనేని సుధాకర్ రావు,రాజు నాయక్ కనకట్ల తిరుపతి జుబేర్‌తో పాటు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీ గీతామందిరంలో అర్చకుల పురోహితులకు సన్మాన కార్యక్రమం




**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూన్ 09 :** ఎల్లారెడ్డి పేట మండలం రాచర్ల గొల్లపెల్లిలోని గీత మందిర్‌లో తేదీ 10-06-2026 బుధవారం రోజున సాయంత్రం 4:00 గంటలకు అర్చకులకు పురోహితులకు సన్మాన కార్యక్రమం హిందూ ఉత్సవ సమితి ఆద్వర్యంలో ఏర్పాట్లు చేశామని శుకానంద దీక్షితులు రాచర్ల రఘు రామ శర్మ తెలిపారు.ఆయన చేతుల మీదుగా కరపత్రాల ఆవిష్కరణ జరిగింది.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవల్సిన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు.హిందూ ఉత్సవ సమితి సభ్యులు మాట్లాడుతూ మన హిందూ ధర్మ పరిరక్షణకు తమ జీవితాలను దైవ సేవకు అంకితం చేసిన అర్చకులుఅలాగే ప్రజల క్షేమం కోసం తమ వృత్తిని అంకితం చేసి ప్రతి ఇంటిలో జరిగే శుభకార్యాలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించే పురోహితుల సేవలు అమూల్యమైనవి.వారి సేవలను గుర్తించి గౌరవించడం మనందరి బాధ్యతగా భావించి, తేదీ 10-06-2026 బుధవారం సాయంత్రం 4:00 గంటలకు అర్చకుల మరియు పురోహితుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నాము.కావున ఆస్తిక మహాశయులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు,

# ఇస్రో సందర్శనకు ఖని విద్యార్థి రిశ్విక్

**-ఇస్రో చైర్మన్ ను కలిసే అవకాశం**

**-ఈ నెల 12న నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీ**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో పాల్గొనడానికి స్థానిక కృష్ణవేణి స్కూల్ విద్యార్థి రాకం రిశ్విక్ కు ఆహ్వానం అందింది. అంతర్జాతీయ సంస్థ ఇస్కాన్ గత ఫిబ్రవరి 3న ఆన్లైన్ లో నిర్వహించిన ప్రపంచ స్థాయి 'భగవద్గీత వాల్యూ ఎడ్యుకేషన్ కాంటెస్ట్'లో స్థానిక కృష్ణవేణి స్కూల్ విద్యార్థి రాకం రిశ్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి ప్రశంసలందుకున్నాడు. జిల్లా వ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులు ఈ కాంటెస్ట్ లో పాల్గొనగా.. 95 శాతం కంటే అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జూమ్ ద్వారా ఇంటర్వ్యూ నిర్వహించి జిల్లా స్థాయి ప్రతిభావంతులను ఎంపిక చేశారు. ఈ నేపథ్యంలో గోదావరిఖని తిలక్ నగర్ కు చెందిన రాకం కిరణ్-శ్వేత దంపతుల కుమారుడు, కృష్ణవేణి స్కూల్స్ లో ప్రస్తుతం 9వ తరగతి చదువుతున్న రాకం రిశ్విక్ జిల్లా స్థాయి సెకండ్ టాపర్ గా నిలిచి తన ప్రతిభను చాటాడు. ఇస్కాన్ సంస్థ ప్రతినిధి ప్రేమ్ రాజ్ చైతన్య, రిశ్విక్ కు బహుమతిగా సైకిల్ తో పాటు ప్రశంసా పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ నెల 12న బెంగళూరులోని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను సందర్శించడానికి, నేషనల్ టాపర్స్ అవార్డ్ సెరెమనీలో పాల్గొనడానికి ఆహ్వానం పంపారు. ఇస్రో చైర్మన్, ఏరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఎస్.సోమనాథ్ ను కలిసే అవకాశంతో పాటు ఆయనతో గ్రూప్ ఫోటో, డమ్మీ రాకెట్ లాంచింగ్ డెమోను తిలకించడానికి తల్లిదండ్రులతో కలిసి రిశ్విక్ బెంగళూరు బయలుదేరి వెళ్ళాడు. కాగా తమ పాఠశాల విద్యార్థి రిశ్విక్ ఇస్రో సందర్శనకు ఎంపిక కావడంపట్ల పాఠశాల డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, కరస్పాండెంట్ మంజులా శ్రీనివాస్ రెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు.


స్కూల్ విద్యార్థి రాకం రిశ్విక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించి

# విద్యాభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాల కల్పన దిశగా చర్యలు

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 9 :** విద్యావ్యవస్థలో ప్రణాళిక బద్ధమైన మార్పుల ద్వారా విద్యార్థులకు విద్యా బోధన, వృత్తి విద్య కోర్సులలో శిక్షణ అందించి ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా మాధ్యమిక విద్యాశాఖ అధికారి అంజయ్య తో కలిసి జూనియర్,డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ ,అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ప్రిన్సిపల్స్ తో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, విద్యావ్యవస్థను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు. టి జి డబ్ల్యు ఐ డి సి ఆధ్వర్యంలో జూనియర్, డిగ్రీ కళాశాలలలో చేపడుతున్న నిర్మాణ పనులను వేగవంతం చేయాలని,కళాశాలలలో విద్యార్థుల హాజరు శాతం పెంపొందించేలా కృషి చేయాలని, నూతన అడ్మిషన్లు నమోదు చేయాలని తెలిపారు. కళాశాలలో అవసరమైన అధ్యాపకులు, సిబ్బంది నియామకం ఉత్తీర్ణత శాతం మెరుగుపరచాలని తెలిపారు. కళాశాలల నిర్వహణ తీరుపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని, సరైన సమయానికి తరగతులు నిర్వహించాలని తెలిపారు.నూతన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించడం, అడ్మిషన్లతో పాటు హాజరు శాతం పెంచే అంశాలపై దృష్టి సారించాలని తెలిపారు.అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా అధునాతన సాంకేతిక కోర్సులలో వృత్తివిద్య శిక్షణ అందించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎ టి సి ల ద్వారా ఉద్యోగం సంపాదించిన వారి వివరాలను విరివిగా ప్రచారం చేయడం ద్వారా అడ్మిషన్ల సంఖ్య పెంపొందించాలని తెలిపారు.మధ్యాహ్న భోజన పథకం అమలు,90 శాతం హాజరు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అధ్యాపకులు నెలలో పూర్తి చేసిన సిలబస్ సంబంధిత రిజిస్టర్ నిర్వహణ, చాప్టర్ వారీగా స్లిప్ టెస్టుల నిర్వహణ,హాజరు శాతం సరిగా లేని విద్యార్థుల వివరాలను ఎప్పటి కప్పుడు తల్లిదండ్రులకు తెలియ జేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల భద్రత అత్యంత కీలకం : కలెక్టర్ రాహుల్ శర్మ



**చురకలు ప్రతినిధి,జయశంకర్ భూపాలపల్లి, జూన్ 09 :** ఎన్నికలలో పారదర్శకత, నిష్పక్షికత కోసం ఈవీఎం వివి ప్యాట్ల భద్రత అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ మంగళవారం జిల్లా కేంద్రంలోని ఈవిఎం, వివి ఫ్యాట్ గోదామును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు మరియు వీవీపాట్ యంత్రాల భద్రతను పరిశీలించారు.గోదాంలో అమలు చేస్తున్న భద్రతా చర్యలు, సీసీటీవీ పర్యవేక్షణ, అగ్ని మాపక పరికరాలు, డబుల్ లాక్ సిస్టమ్ తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే, యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌లను తనిఖీ చేసి, ఎన్నికల సంగం సూచించిన నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత మరియు నిష్పాక్షికత కోసం ఈవిఎంల, వివి ఫ్యాట్ ల భద్రత అత్యంత కీలకమని ఎన్నికల సంగం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి తనిఖీ చేయనున్నామని తెలిపారు. గోదాంలో ఉన్న అన్ని యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనంతరం తనిఖీ రిజిస్టర్ లో సంతకాలు చేసి రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తాళం వేసి సీల్ వేశారు.ఈ తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు

**-బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్**



**చురకలు ప్రతినిధి,కరీంనగర్,జూన్ 09 :** పేరుకే విద్యాశాఖ ప్రకటనలు.. యధావిధిగా ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారం రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ పేర్కొన్నారు జీవో నెంబర్ 1 ను పూర్తిగా విస్మరించి ప్రైవేట్ కార్పొరేటర్ పాఠశాలలు ధనాచనే ధ్యేయంగా డి .ఎఫ్. ఆర్. సి అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా ఫీజులు లక్షల్లో పెంచి విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రుల లో ఇబ్బంది పెడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలు పీజీ దోపిడీని అరికట్టడంలో విద్యాశాఖ అధికారులు పూర్తి వైఫల్యం చెందారని ధ్వజమెత్తారు. ప్రైవేటు విద్యాసంస్థలు అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఐఐటి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ ఈ టెక్నో పేర్లతో ప్రచారాలు నిర్వహిస్తూ విద్యార్థులను విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షిస్తూ లక్షల్లో ఆర్థిక దోపిడి గురి చేస్తున్నారని దీనిమీద విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడం వారు నిద్రమత్తులో ఉన్నారా..? లోపాయికారీ ఒప్పందమా అని మంది పడ్డారు ప్రకటనలకే పరిమితమైన విద్యాశాఖ అధికారులు అనేక ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల ఏదేచ్ఛగా పాఠ్యపుస్తకాలు డ్రెస్ మెటీరియల్ అమ్ముతున్న పాఠశాల విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించకుండా పరోక్షంగా వారికి సహకరించే విధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సీబీఎస్ఈ అప్లికేషన్ ఒక చోట సూచించి దానికి అనుబంధంగా అనేక బ్రాంచ్లు ఏర్పాటు చేస్తున్నారని అధికారుల దృష్టికి వచ్చిన ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? అని ప్రశ్నించారు ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయకపోవడంతో లక్షల ఫీజులు వసూలు చేస్తూ మరియు డొనేషన్ల పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న విద్యాశాఖ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని దీనిపై వెంటనే ఉన్నత అధికారులు స్పందించాలి. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించి ఖాళీ ఉన్న ఉపాధ్యాయ పోస్టులు పెట్టిన భర్తీ చేయాలని మరియు పూర్తిస్థాయిలో జిల్లా విద్యాశాఖ అధికారులను మండల విద్యాశాఖ అధికారులు నియమించాలని లేనిపక్షంలో బీసీ సంక్షేమ సంఘం మరియు అనుబంధ సంఘాలు జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ తెలిపారు.

## క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలి

**-విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాల ప్రదానం**



**చురకలు ప్రతినిధి, జయశంకర్ భూపాలపల్లి, జూన్ 09 :** క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అన్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించిన పోలీసు సిబ్బందిని అభినందించి పోలీస్ కార్యాలయంలో ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో ప్రతి పోలీసు సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. క్రమశిక్షణ, నిజాయితీ, సేవా దృక్పథంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తామని తెలిపారు. పోలీసు శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా ప్రతి ఒక్కరూ తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ ,సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో భారీ నష్టం

**-తప్పిన ప్రాణాపాయం**





**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ లో సోమవారం రాత్రి పిడుగుపాటుతో ఇల్లు ముందటి వేసిన రేకులు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఎటువంటి గాయాలు కానీ ప్రాణనాష్టం కానీ జరగకపోవడంతో కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. సోమవారం రాత్రి మెరుపులతో పాటు ఉరుములు వర్షం రావడం జరిగింది. అదే సమయంలో బాపూజీ నగర్ లోని సాయిబాబా మందిరం పక్కన గల ఆర్.ఎం.పి డాక్టర్ రాచకొండ శ్రీనివాస్ ఇంటి ముందరగల రేకుల షెడ్డు పై ఒకేసారి పిడుగు పడటంతో రేకుల పూర్తిగా ధ్వంసం అయ్యి కింద పడిపోయాయి. రేకుల షెడ్డు కింద ఉన్న రెండు ద్విచక్ర వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి అలాగే రెండు కూలర్లు పూర్తిగా పగిలిపోయాయి. సుమారు రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు రాచకొండ శ్రీనివాస్ తెలిపారు. సంఘటన స్థలానికి తహసిల్దార్ ముస్త్యాల వాసంతి,ఎంపీడీవో సాదినేని ప్రియాంక ఆర్ఐ స్రవంతిలు వెళ్లి పరిశీలించారు.తనకు నష్టపరిహారం ప్రభుత్వపరంగా ఇప్పించాలని స్థానిక తహసిల్దార్ ముస్త్యాల వాసంతి, ఎంపీడీవో సాదినేని ప్రియాంకలను కోరారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందని అధికారులు పేర్కొన్నారు.

## జర్మన్ భాష శిక్షణ ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు

**-జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ**

**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 9 :** తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్, ఉపాధి శిక్షణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో అందిస్తున్న జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం ద్వారా మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు జిల్లాలోని మందమర్రి మండల కేంద్రంలో గల ఇల్లందు క్లబ్ లో రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద చేతుల మీదుగా శిక్షణ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని, జర్మనీ తో పాటు ఇతర యూరోపియన్ దేశాలలో ఉపాధి అవకాశాలను పొందేందుకు అవసరమైన భాషా నైపుణ్యాలను అభ్యర్థులకు అందించడం జరుగుతుందని, జర్మన్ భాషలో ప్రాథమిక, మధ్యస్థాయి పరిజ్ఞానాన్ని అందించడంతో పాటు అంతర్జాతీయ ఉద్యోగ అవకాశాలకు సన్నద్ధం చేయడం జరుగుతుందని తెలిపారు. విదేశీ ఉపాధి అవకాశాలపై ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# గుండారం కళాశాలకు ఇంటర్ అడ్మిషన్ల జోరు

## -110కి చేరిన నూతన అడ్మిషన్లు

**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూన్ 9 :** కమాన్ పూర్ మండలం గుండారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం నూతన అడ్మిషన్లకు జోరందుకుంది. పెద్దపెల్లి జిల్లా వ్యాప్తంగా మొత్తం జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ కు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది ఇందులో మంగళవారం వరకు 110 మంది విద్యార్థులు తమ అడ్మిషన్లు తీసుకున్నారు. అలాగే చాలా వరకు అడ్మిషన్లు రావడం జరుగుతుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల గుండారం ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు.



**కమాన్ పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 110,**

గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మార్కండేయ కాలనీ 20, ప్రభుత్వ జూనియర్ కళాశాల ధర్మారం 78, గోదావరిఖని జూనియర్ కళాశాల గర్ల్స్ 90, రామగుండం జూనియర్ కళాశాల 29, సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 48, కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల 11, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఓదెల 32, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాయ్స్ పెద్దపల్లి 29, ప్రభుత్వ జూనియర్ కళాశాల గర్ల్స్ 61, మంథని బాయ్స్ కళాశాల 14, మంథని గర్ల్స్ జూనియర్ కళాశాల 23, ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాల 15 నూతన అడ్మిషన్లు చేర్చుకున్నారు.

**విద్యకు పట్టం కట్టుకున్న కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్.**

కమాన్ పూర్ మండలంలోని గుండారం ప్రభుత్వ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్ చదివేందుకు విద్యార్థుల సంఖ్య దినం దినం పెరుగుతోందని కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. ఇటీవల కళాశాలలో రామగిరి, కమాన్ పూర్, పెద్దపల్లి మండలాల సర్పంచులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయగా వారి మద్దతుతో విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు.అలాగే ఉత్తమ ఉపాధ్యాయులచే ప్రత్యేక బోధన వల్ల తమ కళాశాల ఉత్తీర్ణత శాతం పెరిగిందని దీంతో గుండారం కళాశాల వైపు విద్యార్థులు చూస్తున్నారని చేరుతున్నారని పేర్కొన్నారు. తమ కళాశాలకు మద్దతు పలకాలని ప్రజాప్రతినిధులను ప్రిన్సిపల్ సుధాకర్ కోరారు.



# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పగడ్బందీగా నిర్వహించాలి

## -జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు

**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 9 :** జూన్ 25వ తేదీ నుంచి చేపట్టనున్న ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. మంగళవారం జిల్లాలోని హాజీపూర్, భీమారం, జైపూర్ మండల తహసిల్దార్ కార్యాలయాలను బి సెక్షన్ సూపరింటెండెంట్ మధుసూదన్ తో కలిసి సందర్శించి సిబ్బందితో ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం, సాదా బైనామా దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తుల పరిష్కరణ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాములు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 3వ విడత సర్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జూన్ 25 వ తేదీ నుంచి నిర్వహించనున్న ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని ఎలాంటి పొరపాటులకు తావు లేకుండా సక్రమంగా నిర్వహించాలని, బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని, సూపర్వైజర్లు, ఏఈఆర్వోలు పనుల పురోగతిని పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారం కోసం భూ భారతి పోర్టల్ ను అందుబాటులోని తీసుకువచ్చి ప్రజల ప్రతి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని, ఈ క్రమంలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తుల పరిష్కరణ వేగవంతం చేయాలని తెలిపారు. సాదా బైనామా దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేసి క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలని తెలిపారు. కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, కార్యాలయానికి వచ్చే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగాలని, సర్టిఫికెట్లను నిబంధనలకు లోబడి నిర్ణీత గడువులోగా జారీ చేయాలని తెలిపారు.




# బస్తీలలో స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించాలి

## -బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు దావ స్వాతి

**చురకలు ప్రతినిధి, మంచిర్యాల, జూన్ 9 :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని బస్తీలలో కొనసాగుతున్న స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించి వేరే ప్రాంతాలలో ఏర్పాటు చేసుకోవాలని బెల్లంపల్లి మున్సిపల్ అధ్యక్షురాలు దావ స్వాతి రమేష్ బాబు సూచించారు. మంగళవారం మున్సిపల్ అధికారులతో కలిసి పట్టణంలోని మహమ్మద్ ఖాసిం బస్తీలో కొనసాగుతున్న స్క్రాప్ దుకాణాన్ని ఆమె పరిశీలించారు.నిబంధనలు గాలికి వదిలి కనీస భద్రత ప్రమాణాలు పాటించకుండా జనావాసాల్లో స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేశారని ప్రజలు ఫిర్యాదు చేయడంతో తాను తనిఖీ చేసినట్లు ఆమె తెలిపారు.జనావాసాల్లో ఏర్పాటు చేసిన స్క్రాప్ దుకాణాల వద్ద తీవ్ర అపరిశుభ్రత నెలకొందని చెప్పారు . ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించి వేరే చోటికి తరలించాలని యజమానులకు సూచించారు. స్క్రాప్ దుకాణాలను వెంటనే తొలగించినట్లయితే శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ అధ్యక్షురాలు దావ స్వాతి రమేష్ బాబు వెంట కమిషనర్ తన్నీరు రమేష్ తో పాటు సిబ్బంది ఉన్నారు.



**బెల్లంపల్లి బస్తీలో కల్వర్టు పనుల పరిశీలన**

బెల్లంపల్లి పట్టణంలోని 19 వ వార్డులో రూ 5 లక్షల మున్సిపల్ నిధులతో నిర్మిస్తున్న నూతన కన్వర్ట్ నిర్మాణ పనులను మంగళవారం మున్సిపల్ అధ్యక్షురాలు దావ స్వాతి రమేష్ బాబు పరిశీలించారు. బస్తీ ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలను దృష్టిలో పెట్టుకొని కల్వర్టు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్, అధికారులను ఆమె ఆదేశించారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ ఉన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

## -ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి



**చురకలు విలేఖరి,కరీంనగర్, జూన్, 09 :** రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు ఉపాధ్యాయులకు పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర క్యాబినెట్ మంత్రులకు రాష్ట్ర ప్రభుత్వం చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన 5 డి ఏ లు 2వ పిఆర్సి నివేదికకు వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేతన సవరణ కమిటీ చైర్మన్ ఎన్ శివశంకర్ వద్ద ఉన్న పిఆర్సి నివేదికకు తెప్పించుకొని వెంటనే ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్సి ప్రకటించాలని హెల్త్ కార్డు వెంటనే అమలులో వచ్చినట్టు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని గతంలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే అన్ని ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సిపిఎస్ రద్దుపరిచి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే తెలంగాణ రాష్ట్రంలో అమలుపరచాలని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ విజ్ఞప్తి చేశారు ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల బకాయిలను అన్నిటిని వెంటనే మంజూరు చేయాలని దానికి సంబంధించిన బడ్జెట్ను వెంటనే కేటాయించి పెండింగ్లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మెడికల్ బిల్స్ సాలండర్లు లీవ్ జిపిఎఫ్ కు సంబంధించిన నిధులను వెంటనే మంజూరు చేయాలి అని మహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు లకు విజ్ఞప్తి చేశారు.

# వాటర్ ప్లాంట్ పునఃప్రారంభం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూన్ 9 :** రామగిరి మండలం రామగిరి మండలం బుధవారంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించారు. బుధవారంపేట సర్పంచ్ కన్నూరి రవీందర్, రామగిరి మండల ఎంపీ ఓ సమ్మిరెడ్డి, డిసిసి సెక్రటరీ బుద్ధార్థి బుచ్చన్న పటేల్ గారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించారు.సుమారు పదిహేను సంవత్సరాల క్రితం వరంగల్ డయాసిస్ సాంగీక సేవా సంస్థ మరియు గ్రామస్థుల సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ యంత్రాంగం ఇటీవల కాలంలో మరమ్మతులకు గురైంది. ఈ నేపథ్యంలో కొత్త మిషనరీని ఏర్పాటు చేసి గ్రామ ప్రజలకు తిరిగి అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.గ్రామ ప్రజలు అందరూ శుద్ధమైన తాగునీటిని వినియోగించుకోవాలని ఈ సందర్భంగా సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుద్ధార్థి విజయ, ఏఎంసి డైరెక్టర్ ఆరేల్లి శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు బావు స్వరూప కత్తెరసాల, బైరెడ్డి అనూష సతీష్, కన్నూరి రాకేష్, పుదరి శ్రీనివాస్, మరుకు చంద్రశేఖర్, కన్నూరి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి చొప్పరి రాకేష్, పెంద్రు సుమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష

**చురకలు క్రైమ్ ప్రతినిధి,కరీంనగర్, జూన్ 9 :** కరీంనగర్ రూరల్, పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమమం నిర్వహిస్తుండగా, పెద్దపెల్లి జిల్లా గోదావరిఖని కి చెందిన పర్ష శరత్ కుమార్ అనునతడు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడగా పోలీసులు మంగళవారం మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా జడ్జి నిందితుడికి ఆరు రోజుల జైలు శిక్ష విధించడం జరిగిందని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు.

# పోలీసింగ్లో.. సాంకేతిక పరిజ్ఞానమే అత్యంత కీలకం

**-కరీంనగర్ సీపీ గౌస్ ఆలం**
**-హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిపి**
**-జూన్ 15లోగా 'సీసీటీఎన్ఎస్' డేటా అప్‌డేట్ పూర్తి**
**-డ్రగ్స్ నియంత్రణకు నార్కోటిక్ డాగ్ స్క్వాడ్, టెస్ట్ కిట్లు**




**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ జూన్ 9 :** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీస్ శాఖ సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ, నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. మంగళవారం ఆయన హుజూరాబాద్ ఏసీపీ కార్యాలయం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్ఓలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో కలిసి పెండింగ్ కేసులు, శాంతిభద్రతల పరిస్థితిపై ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ.. రాష్ట్ర డీజీపీ ఆదేశానుసారం జిల్లాలో మరింత పారదర్శకమైన,పటిష్టమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.జూన్ 15లోగా 'సీసీటీఎన్ఎస్' అప్‌డేట్ సాంకేతికతను అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0 సరికొత్త 'ఈ-సాక్ష్య' సాఫ్ట్వేర్ సహాయంతో సమర్ధవంతంగా కేసుల పురోగతిని పర్యవేక్షిస్తామని సీపీ తెలిపారు. జూన్ 15వ తేదీ లోపు పెండింగ్‌లో ఉన్న అన్ని కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ చేస్తామని, ఎఫ్ఐఆర్‌లతో పాటు కేసు దర్యాప్తు పత్రాలను కూడా నిబంధనల ప్రకారం డిజిటలైజ్ చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.కొత్త చట్టాల ప్రకారం డిజిటల్ సాక్ష్యాల సేకరణ ఎంతో కీలకమని, దీనిపై సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

**బ్యాంకుల్లో భద్రతా ఆడిట్.. నేపాలీ ముఠాలపై నజర్...**

గత నెలలో జిల్లా కేంద్రంలో జరిగిన జువెలరీ షాప్ దోపిడీ కేసును దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తగా జిల్లావ్యాప్తంగా ఉన్నఅన్ని బ్యాంకులు, జ్యువెలరీ షోరూమ్‌లలో సెక్యూరిటీ ఆడిట్ పూర్తి చేసినట్లు ఉన్నతాధికారులు తెలిపారు. హుజూరాబాద్ సబ్‌డివిజన్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీలలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించామని, నిబంధనలు పాటించని యాజమాన్యాలకు నోటీసులు జారీ చేస్తున్నామని వివరించారు.ప్రతి హోటల్,లాడ్జి యాజమాన్యం తమ వద్దకు వచ్చే అతిథుల వివరాలతో కూడిన వీక్లీ రిపోర్టును తప్పనిసరిగా పోలీసులకు సమర్పించాల్సి ఉంటుంది. అలాగే, రాష్ట్రంలో నేపాలీ ముఠాల నేరాల నేపథ్యంలో జిల్లాలో పనిచేస్తున్న నేపాలీ పౌరుల బయోడేటా, గుర్తింపు పత్రాలతో ప్రత్యేక డేటాబేస్‌ను సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

**'నార్కోటిక్స్' నియంత్రణకు ప్రత్యేక డాగ్ స్క్వాడ్**

డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతామని సిపి గౌస్ ఆలం హెచ్చరించారు. అనుమానాస్పద ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్‌లు, విస్తృత వాహన తనిఖీలు చేపట్టడమే కాకుండా, మత్తుపదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా 'నార్కోటిక్ డిటెక్షన్ డాగ్' సహాయంతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సేవించిన వారిని గుర్తించేందుకు అత్యాధునిక 'యూరిన్ డ్రగ్ టెస్ట్ కిట్స్' వాడుతున్నామని, ఎవరైనా డ్రగ్స్ వాడుతూ దొరికితే ఎన్డీపీఎస్‌యాక్ట్ కింద కఠినచట్ట పరమైన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

**మహిళా రక్షణకు 'షీ లీడ్స్', 'ఆపరేషన్ స్నేహ'**

మహిళలు, విద్యార్థినుల భద్రత కోసం ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు సీపీ తెలిపారు.క్షేత్రస్థాయిలో మహిళా పోలీసుల భాగస్వామ్యాన్ని పెంచుతూ 'షీ లీడ్స్' కార్యక్రమాన్ని బలోపేతం చేస్తున్నామన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో వేధింపుల నివారణకు 'ఆపరేషన్ స్నేహ' కింద ప్రతి పాఠశాలలోనూ 'షీ కంప్లైంట్ బాక్స్' ఏర్పాటు చేశామని వెల్లడించారు. వేధింపుల గురించి నేరుగా చెప్పలేని విద్యార్థినులు ఈ బాక్సుల్లో ఫిర్యాదులు వేయవచ్చని, ప్రతి పాఠశాలకు ఒక మహిళా కానిస్టేబుల్‌ను కేటాయించి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**సీసీ కెమెరాల జియో ట్యాగింగ్**

పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ కింద 100 మంది కంటే ఎక్కువ జనాభా తిరిగే అన్ని వ్యాపార, వాణిజ్య సముదాయాలు, ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటును తప్పనిసరి చేశామని, దీనిపై ఇప్పటికే నోటీసులు ఇచ్చామని సీపీ తెలిపారు.పాడైపోయిన పాత సీసీ కెమెరాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేస్తున్నామని,అన్ని కెమెరాలను జియో ట్యాగింగ్ ప్రక్రియ ద్వారా అనుసంధానిస్తున్నట్లు పేర్కొన్నారు. హుజూరాబాద్ డివిజన్ పరిధిలోని పోలీస్ ఆఫీసర్స్,సిబ్బంది పనితీరు అద్భుతంగా ఉందని, వార్షిక తనిఖీల్లో రికార్డులన్నీ సక్రమంగా ఉన్నాయని సి పి గౌస్ ఆలం అభినందించారు. ప్రభుత్వ, డీజీపీ ఆశయాలకు అనుగుణంగా ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నేర రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో హుజూరాబాద్ ఏసీపీ మాధవి,సిఐలు టి.కర్ణాకర్,రామకృష్ణ గౌడ్,పులి వెంకట్ గౌడ్,వి.శ్రీనివాస్,ఎస్ఐలు కె.స్వాతి, శేఖర్ రెడ్డి, తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# చోరికి గురైన 108 సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేత



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూన్, 09 :** నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల ఆదేశానుసారంగా, నిర్మల్ పోలీసులు మొబైల్ దొంగతనాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి CEIR పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించి 108 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశారు. సెల్ ఫోన్ పోయిన, చోరీకి గురైన ఆందోళన చెందవద్దని CEIR ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోగొట్టుకున్న, చోరి గురైన 108 మొబైల్ ఫోన్లు (పన్నెండు లక్షల తొంభై ఆరువేల రూపాయల విలువ గల ఫోన్లను) స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ వినియోగదారులతో మాట్లాడుతూ మొబైల్స్ ఎలా పోగొట్టుకున్నారు అని అడిగి తెలుసుకున్నారు.మొబైల్ ఫోన్ పోయిన,చోరికి గురైనా www.ceir.gov.in లో రిజిస్టర్ చేసుకోవాలనీ, వినియోగ దారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు.పోయిన లేదా చోరీకి గురైన మొబైల్ ఫోన్లను త్వరితగతిన పట్టుకోవడానికి CEIR వెబ్సైట్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. CEIR వెబ్సైట్లో వినియోగదారులు సంబంధిత పోలీస్ స్టేషన్ లో వారి వివరాలను నమోదు చేసుకుంటే మొబైల్స్‌ని ఈ పోర్టల్ ద్వారా సులభంగా స్వాధీనం చేసుకునే ఆస్కారం ఉంటుందని తెలిపారు. పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఈ సందర్భంగా మొబైల్ పోగొట్టుకున్న వినియోగ దారులు,ఫోన్ దొరికినందుకు చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఎస్పీ.జానకి షర్మిలకు ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 2250 ఫోన్లు (సుమారుగా రెండు కోట్ల డెబ్బై లక్షల రూపాయల రూపాయల విలువ గల ఫోన్లను) రికవరీ చేసి బాధితులకు అందించడం జరిగిందని అన్నారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ల కొనుగోలు, విక్రయాలపై కఠినంగా పర్యవేక్షణ చేయాలని సూచించారు. వినియోగ దారులు, సెకండ్ హ్యాండ్ మొబైల్స్ కొనేటప్పుడు అవి ఎక్కడి నుండి వచ్చినవి, చోరీకి గురైనవో కాదో సరిచూసుకోవాలని, అనుమానం ఉన్న ఫోన్లను కొనరాదని తెలిపారు. అంతేకాకుండా ఒకే వ్యక్తి వద్ద లేదా కొద్ది మంది వద్ద పెద్ద సంఖ్యలో మొబైల్స్ దొరికితే, వారు ఏదైనా చోరీ ముఠా లేదా అనుమానాస్పద కార్యకలాపాలలో భాగమా అనే దానిపై సమగ్ర విచారణ చేయాలని పోలీసు అధికారులకు ప్రత్యేక సూచనలు ఇచ్చారు. CEIR ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎవరికైనా సెల్ఫోన్లు దొరికితే సంబంధిత పోలీస్ స్టేషన్లో గాని లేదా ఆ నెంబర్ వారికి ఫోన్ చేసి వారికి అప్పగించాల్సిందిగా సూచించారు.ఈ సందర్భంగా సాంకేతికతను ఉపయోగించి మొబైల్ ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ సిబ్బందిని జిల్లా ఎస్పీ.జానకి షర్మిల అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ.జానకి షర్మిలతో పాటు, అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఉపేందర్ రెడ్డి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు



**-భారీగా కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాల స్వాధీనం**

**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, జూన్ 9 :** నగరంలోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం మెరుపు దాడులు నిర్వహించారు. మార్కెట్లోని గౌరిశెట్టి రమేష్,సిద్ధంశెట్టి చక్రపాణి కిరాణం,సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో జరిపిన ఈ సోదాల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలను కనుగొన్నారు.ఈ దాడుల సమాచారాన్ని వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు చేరవేయగా,ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అంకిత్ రెడ్డి,రోహిత్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు.టాస్క్ ఫోర్స్ బృందం వారి సమక్షంలో సుమారు 47 బస్తాల కారంపొడి (ప్రతి బస్తా బరువు 50 కిలోలు),2 బస్తాల పసుపు, మరియు 1బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దుకాణాల నుండి నమూనాలను సేకరించి,పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ పరీక్షల ఫలితాలు వచ్చే వరకు సదరు స్టాక్‌ను పూర్తిగా సీజ్ చేయడం జరిగిందని, అలాగే ఈ సుగంధ ద్రవ్యాల అమ్మకాలపై పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు.ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్ కానిస్టేబుల్ సాయిదీప్ లు పాల్గొన్నారు.

# విద్యార్థులు యువత క్రీడల్లో రాణించాలి



**-కాంగ్రెస్ నేత వొడితల ప్రణవ్**
**-ఉప్పల్లో క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేసిన ప్రణవ్**

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూన్ 9 :** విద్యార్థులు యువత క్రీడల్లో రాణించాలని, గ్రామీణ క్రీడాకారులు రాష్ట్ర జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రయాణించాలని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామంలో కాంగ్రెస్‌నేత స్వర్గం రవి తల్లిదండ్రులు దివంగత స్వర్గం సరోజన రాజేశ్వరరావు స్మారకక్రికెట్ టోర్నమెంట్ జిల్లా పరిషత్ బాలుల పాఠశాల నిర్వహించగా బహుమతి ప్రధాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. టోర్నమెంట్ విజేతగా నిలిచిన హుజురాబాద్ జట్టుకు ట్రోఫీతో పాటు రూ.50 వేల నగదు బహుమతి, రన్నర్ అప్ గా ఉప్పల్ జట్టుకు రూ.25 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ప్రణవ్ మాట్లాడుతూ.. స్వర్గం రవి ప్రత్యేక చొరవ తీసుకొని వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడలు యువతలో శారీరక మానసిక ఉత్తేజాన్ని నింపుతాయని అన్నారు. గ్రామీణ పట్టణ యువకులు ఏదో ఒక క్రీడలో రాణించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, గ్రామ సర్పంచ్ రామ నాగరాజు, మార్కెట్ చైర్మన్ ఝాన్సీ రవీందర్,ఉప సర్పంచ్ సిద్ధార్ తదితరులు పాల్గొన్నారు.